# ఈ మచ్చ చెరిగిపోదు



నిగండ్ల పరమేశ్వరరావు

మధ్యాహ్నం రెండు గంటల వేళ ....సుభద్రమ్మ ఇంట్లో మహిళా మండలి పోగయింది. నలుగు రయిదుగురు అమ్మలక్కలు చేరి ఏవేవో తమ నోటికొచ్చినవి వాగే స్తున్నారు. అప్పుడే రంగంలోకి వచ్చింది కాంతమ్మ- "ఈశ్వరి మ్మొడినా! ఈ విడ్డూరం విన్నారా?" అంటూ.

"అదేగా- ఆ అవధాన్లుగారి కోడలు లేచిపోవడమేగా?" అదేదో పాతబడిపోయినట్లు తీసిపార వేసింది సుభద్రమ్మ.

"అది కాదు పార్వతమ్మక్కా!

పోయేకాలం కాకపోతే దానికదేం బుద్ధీ అంట? కుందనపు బొమ్మ అనుకున్నాం గాని, ఇటువంటి దను కోలేదు. పిదపకాలం- పిదప బుద్ధులూను. లేచిపోయే దాని కింకె వరూ దొరకలేదూ హన్నా!" అంటూ నోటిమీదికి చేయిపోనిచ్చింది ఆశ్చ ర్యంతో నోరెళ్ళబెట్టి.

"మూనారు సంధ్య వీట్లో వస్తూంటే ఇద్దరూ ముందూ, వీడు వెనకా వెళుతున్నారట ఉదయం. అప్పుడు ఎవరికీ అనుమానం కలగలేదు. ఆయన ఆఫీసుకి వెళ్ళ బోయేంతలో గుప్పుమంది గోల." చెప్పుకుపోతోంది వెంకటలక్ష్మి.

అప్పుడే అక్కడకు వచ్చిన సుశీల ఆ వస్సి విని- "ఎవరిగురిం చొదినా?" అంటూ ఈశ్వరమ్మను ప్రశ్నించింది.

"ఇంకెవరి గురించో అయితే ఇంతగా అనుకో వల్సిందేముంది మ్మాయ్! ఆ అవధాన్లు గారు లేడూ-ఆయన ముద్దుల కోడలు లేచిపోయిందట! అదీను పాల వాడితో! ఛ-ఎంత నామర్దా! ఆ మగాడు ఇంక వీధిలో తలెత్తుకు తిరగ్గలడంటారా? ఎంత వయ్యారం- ఎంత మిడిసిపాటు! అప్పుడే అను కున్నా దాన్ని చూసి-ఇదేదో ఇటు వంటి వ్యవహారమేనని" అంది ఈశ్వరమ్మ చేతులు తిప్పుతూ.

సుశీలకు తటుక్కున అవధాన్లు గారి కోడలు మంజుల గుర్తు కొచ్చింది. ఆమె బజారులో భర్త వెంట పోతూంటే, చిలక ముక్కుకు దొండపండని తానే ఈర్ష్య పడేది. బంగారం కాంతి ఆమె వర్ఛస్సు ముందు తను వెలితిగా, ఎర్ర అంచు బోర్డర్ తెల్ల చీరలో, ఒంటి పేట గొలుసు తో, పొడుగాటి నల్లని వదులు జడతో, అందులో దొంతర మల్లెదండే కనకాంబరాలతో, చేప కళ్ళ లాంటి కళ్ళకు కాటుక పెట్టి, నొసటున ఎర్రకుంకుమ బొట్టు పెట్టుకొని బజార్న పోతున్న సుశీలను, తన భర్తే అదే పనిగా చూస్తూంటే, చేతితో అతని ముఖాన్ని ఇటు తిప్పటం గుర్తొ చ్చింది సుశీలకు.

అటువంటి కళ్ళు తిప్పుకోలేని అందం మంజులది. బజారున పోతూంటే క్రిందే చూస్తూ పోయేది. ఆమెలో ఎంత మూర్తీభ వించిన అణకువ! నిజంగా ఆమె అందానికి అసూయపడ్డా, ఆ అణకువను పొగడకుండా వుండ లేక పోయేది సుశీల.

అటువంటి మంజుల లేచి పోయిందంటే నమ్మశక్యం కాకుండా వుంది సుశీలకు.

"అది ఒకేడు కాలేజీ కూడా వెలగబెట్టిందటలే! అక్కడ కూడా ఈ వేషాలే వేస్తే గుట్టు చప్పుడు కాకుండా పీడికిచ్చి కట్టబెట్టారట! తిరిగే కాలు. తిట్టే నోరు ఊర కుండవని ఇందుకే అంటారు." పార్వతమ్మ తనకు తెలిపిన నిజాన్ని బయట పెట్టింది.

"అలాగా!" అంటూ అమ్మలక్కలు ఒక్కసారి నోళ్ళు వెళ్ళబెట్టారు.

"అసలా అవధాన్లుగారు బోల్తా పడ్డారంటే నమ్మ్మ. ఆ శీను ఎంత అమాయకుడో, అంత బుద్ధి మంతుడు కూడాను. అసలు అతనికి మా పెద్దదాన్ని యిద్దామనుకున్నాంగాని, వాళ్ళడిగినంత కట్నం ఇచ్చుకోలేక మానుకున్నాం. ఎంత వినయంగా వుంటాడో! ఎటువంటి వాడికి ఎటువంటిది దొరికింది___ ఇంటి పేరు మట్టి కలపడానికి. అంతేనమ్మా! మనం బంగారం అనుకున్నది మట్టి గెడ్డయి ఊరుకుంటుంది___కలికాలం!" సుభద్ర అధ్యక్షోపన్యాసం ఇచ్చింది.

ఆ బ్రాహ్మణవాడ అంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది- మంజుల లేచిపోవడం గురించి. ఉదయం నుంచి అవధాన్లుగారు, కొడుకు, భార్య బయట కనిపించడం లేదు. శ్మశాన వైరాగ్యం అవరించింది ఇంట్లో. ఎంతో కళకళలాడే ఆ ఇంట్లో ఏదో అమంగళం జరిగినట్లుందా వాతావరణం. అప్పుడప్పుడు అరిచే కుక్క అరుపులు తప్ప ఆ కాంపౌండంతా నిశ్శబ్దంతో నిండి వుంది.

పక్కింటిలోని శంకరానికి భార్య సాయంకాలం చెప్పినప్పుడు, "ఇది నిజమా! ఇలా నిజంగానే జరిగిందా? పాపం!" అంటూ ఆశ్చర్యపోయడు. అతని కళ్ళ నుండి రెండు ఆనందాశ్రువులు రాలి క్రిందపడ్డాయి. మరి ఆడ మళయాళం అంతా ఆశ్చర్యంతో నోళ్ళెళ్ళబెడుతూంటే శంకరం ఆనందించడం విడ్డూరంగా లేదూ?

వారం క్రితం శంకరం కాంపౌండ్‌లోని చెట్లకు ఉదయం ఆరు-ఆరున్నర ప్రాంతంలో నీళ్ళు పోస్తున్నాడు. అవధాన్లుగారింట్లో నుంచి వినిపిస్తున్న మాటలనే వింటూ నిల్చుండిపోయాడు విస్మయంతో. అది రోజూ జరుగుతున్నదే ఆ ఇంట్లో.

* * *

"లక్ష్మీ! ఎక్కడ చచ్చావే? ఈ శని ముఖాన్ని ఇక్కడికెందుకు రానిచ్చావే! శ్రీరామ! శ్రీకృష్ణ! ఈరోజేం కీడు జరక్కుండా చూడు

స్వామీ! ఈ పాపిష్టి ముఖాన్ని పొద్దునే చూశా. త్వరగా చావవే!" అనేంతలో భార్య లక్ష్మి అక్కడకు వచ్చింది. అక్కడ ఎదురుగా నిలుచున్న కోడలును, భర్తను చూసింది.

"ఈ పాడు ముఖాన్ని ఇటు ఉదయం రానివ్వద్దని ఎన్నిసార్లు చెప్పినా నీకు బుద్ధుండదు. ఈ రోజు నేను క్షేమంగా తిరిగి వస్తానంటావా ఇంటికి? శ్రీ ఆంజనేయ! ప్రసన్నాంజనేయ! అదీగాక ఈ రోజు శాంక్షన్‌కి పై ఆఫీసర్ దగ్గరకు పోవాల్సుంది. అలా రాయిలా నిల్చున్నావేమే! పోయి కాసిని పసుపు నీళ్ళు తెచ్చి ఈ తలపై చల్లు!" గాండ్రించాడు భార్యను.

ఆమె గబగబా పరుగుతో వెళ్ళి పసుపు నీళ్ళు తెచ్చి తలపైన చల్లగానే, వెనక్కి తిరిగి తన గదిలోని తన తల్లి ఫోటోకి నమస్కరించి, ప్రక్కనే ఉన్న ఆంజనేయస్వామి పటానికి నమస్కరించి బయటబడ్డాడు నిష్టాగరిష్టుడైన అవధాన్లుగారు.

"ఏమిటే-అలా శిఖండిలా నిల్చున్నావ్! నిన్ను ఉదయం తొమ్మిది గంటల వరకూ మగవాళ్ళ గదుల ఛాయలకు రావద్దన్నానా? మనం ఎలాగూ ఇంట్లో చచ్చే వాళ్ళం-ఫర్వాలేదు. వాళ్ళు ఆఫీసులకెళ్ళి పనులు చేసుకొచ్చేవారు. వాళ్ళు సక్రమంగా రావాలని నీకు లేదటే! ముదనష్టపుముండ—పో ఆ వంటింట్లోకి. అక్కడే చావక పొద్దున్నే ఇక్కడికెందుకు తగలడ్డావ్?" అంటూ చేత్తో ఆమె తలమీద మొట్టింది.

కిక్కురు మనలేదు మంజుల.

ఉదయం లేవడంతో ముందు గౌరిదేవికి పూజచెయ్యడం ఆమె కలవాటు.

మామగారు లేచి ఉండరులే - అని పూలకోసం అటు వచ్చింది.

ఆమె అటురాగానే ఇటు మామగారు, అత్తగారు ఆమెమీద పడ్డారు.

గుడ్డలోని నీళ్ళు గుడ్డలోనే కుక్కుకొని వెనక్కు వెళ్ళిపోయింది.

అత్తగారెక్కడో పనిలో ఉంది. కాఫీ చల్లారిపోతూంటే వెళ్ళి భర్తకిచ్చింది.

"లేస్తూనే వచ్చావూ? అమ్మా! దీంతో ఉదయమే కాఫీ ఎవరు పంపమన్నారే? ఛీ..పొద్దున్నే గొడ్డు మోతు ముఖాన్ని చూడాల్సివచ్చింది. అవతలకు పో-నేనీ కాఫీ త్రాగను"

అంటూ నేలకేసి కొట్టాడు కాఫీ గ్లాసుని.

ఎక్కడినుంచో ఆ శబ్దం విని పరుగున వచ్చింది తల్లి లక్ష్మి. వస్తూనే కోడల్ని కొర కొర చూసింది.

"అది కాదత్తయ్యా! కాఫీ చల్లారిపోతుందేమో...." ఆమె మాటలు పూర్తికాకముందే మంజుల చెయ్యి పట్టుకొని బరబరలాక్కుపోయింది వంటింట్లోకి.

దీనికంతకూ కారణం - మంజులకు ఐదేళ్ళయినా పిల్లలు పుట్టకపోవడం మూడో ఏటినుంచి నెమ్మదిగా నిరాదరణ ప్రారంభమయి, ఆయిదో సం॥రం అయిపోగానే అది తారాస్థాయి నందుకొంది.

అత్త మామల దగ్గర నోరెత్త లేదు మంజుల. అలా తయారు చేశారు ఆమెను.

కొడుకు-తల్లి ప్రతి మాటనూ, 'అవును. అమ్మ చెప్పిందే నిజం!' అంటాడు.

"గొడ్డుబోతుదాన్ని మాకంటగట్టాడు మీ నాన్న. పున్నామ నరకంనుండి విముక్తి పొందే అదృష్టంలేదు మాకు. పురుగులు పడి చస్తాడు చూడు-మీ నాన్న"

అంటూ సాధిస్తూంటుంది అత్తగారు.

"అవంటుకోకమ్మా!" అంటూ పూజకు కోసిన పూలను కూడా అంటుకోనివ్వదు తనను అత్తగారు.

ఎప్పుడైనా ఆడపడుచులు వస్తే పిల్లల్ని తన దగ్గరకు రానివ్వదు.

ఎక్కడ తన చూపు తగిలి వాళ్ళకు శని అంటుకుంటుందో నని భయంతో తనతో మాట్లాడనివ్వదు.

ఇప్పుడు మానసికంగా, శారీరకంగా మంజుల శవమే అయిపోయింది.

మనిషి అన్న పేరు ఆమెకా ఇంట్లో లేదు.

పూజ పూలు అంటుకోకూడదు.

ఉదయం లేస్తూ ఆమెను మావగారు, భర్త చూడకూడదు. చూస్తే శనట.

పాపం 24 సంవత్సరాలు నిండని మంజుల నరకం అంటే ఎలా వుంటుందో ఆ ఇంట్లో అనుభవిస్తోంది.

భగవంతుడు ఇవ్వని దానికి ఆమేం చేస్తుంది?

అది ఆమె తప్పా?

ఆమె మాట వినేదెవరు!

పిల్లలు పుట్టకపోతే, లోపం ఒక్క స్త్రీదేనా? పురుషుడిదయి ఉండకూడదా?

జరుగు పొరుగువారు తమింటికి రారు.

అత్తగారే అప్పుడప్పుడు పక్కవాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వస్తుంది.

ఆరోజు మధ్యాహ్నం ఆలోచించింది-తన నరకంలాంటి జీవితానికి అంతం ఎక్కడని? చివరికి ఉపాయం దొరికింది-చచ్చిపోవాలి.

కాని తనుపోతే నెల లోపల వాళ్ళబ్బాయికి పెళ్ళి చేస్తారు. తనను ఒక్క నెలలో అంతా మరిచిపోతారు. తన నెలా క్షణక్షణానికి కుళ్ళి కుళ్ళి చచ్చేలా చేశారో, వాళ్ళనలా చేయాలి. అదే తన కసికి ప్రతీకారం.

ఎలానూ తను చావాలనుకుంది.

చావుకంటే బ్రతకడం ఎన్నోరెట్లు మేలు!

ఆ బ్రతకడం ఎటువంటి దైనా ప్రతీకారం తీర్చుకోవాలి!

తనకందుబాట్లో ఉందొక్కడే-పాలవాడు.

ఉదయం రోజూ ఐదు గంటలకు తానే పాలబాటిల్ తీసుకొంటుంది గేటువరకు వచ్చి.

వాడు ఎటువంటివాడైనా తన కనవసరం! ఎలాగూ చావాలనుకుంది. ఎవ్వడితో ఉంది-తన కనవసరం. కక్షే ముఖ్యం!

చిన్న కాగితంమీద నాలుగు ముక్కలు రాసి వాడికిచ్చింది. వాడికి చదువు వచ్చో రాదోనని కూడా ఆమె కనుమానం రాలేదు.

"నేనిక్కడ నరకం అనుభవిస్తున్నాను. అన్నీ తెంచుకొని నీతో రావాలనుకుంటున్నాను. నాకు కావలసింది నీ అండ. అంతే! బెదిరించడం కాదు. నేను బయటికి రానప్పుడు నా దారి గోదారే-అంటే చచ్చిపోవడం. రేపు ఏ విషయం చెప్పు!" రాసి వాడికిచ్చింది- పాలసీసా తీసుకునేప్పుడు. వాడు రూపాయ నోటుతో పాటే దాన్ని జేబులో వేసుకొని వెళ్ళిపోయాడు. డబ్బులు లెక్కపెట్టుకునేప్పుడు ఆ కాగితం గుర్తొచ్చింది. విప్పాడు- కాని చదువు రాదు. సైకిల్ మీద పోయే అతన్ని పిలిచి, ఆపి చదవమన్నాడు. 'ఇదేదో లవ్ లెటరోయ్!' అంటూ వాడ్ని ఎగా దిగా చూపి, దాన్ని చదివి వినిపించి వెళ్ళిపోయాడు.

తన పరిస్థితి అర్థమయింది వాడికి.

ఆమెను అప్పుడప్పుడు పగలు ఒకటి రెండు సార్లు చూశాడు.

'ఆమెకు, తనకు పొత్తా?

కాని ఆమె చచ్చి పోతానం టూంది.

ఆమె చావకూడదు!

అన్నీ త్యజించి తనతో వస్తానం దంటే. ఆమె ఎటువంటి బాధలు పడుతోందో?

తానేమి చేస్తైనా ఆమెను బ్రతికించుకోగలడు. తన దగ్గర కండబలముంది.

కాని, కాని...?'

వాడి మనసు పని చెయ్యడం లేదు.

గేటు చప్పుడవగానే రాత్రంతా నిద్రలేని మంజుల ఒక్క పరు గులో వచ్చింది.

కాని పాలవాడు అతను కాదు, ఇంకొకడు.

ఆమెలోని ఆశ చచ్చిపోయింది.

'అతను కూడా భయపడ్డాడు. తనకే దారీలేదు.' ఆమె కళ్ళుబాధతో వర్షించాయి.

రెండో రోజు తెల్లవారబో తుండగా అతను వచ్చాడు పాల సీసాతో.

చీకట్లో ఆ ముఖం చూసి ఖంగారుపడ్డాడు.

నెమ్మదిగా అన్నాడు- "మీరే గెలిచారు. నాకు గుండె ధైర్యం రావడానికి ఈ రోజు పట్టింది. రేపీవేళకి తయారుగా వుండండి!"

ఆనందం పట్టలేకపోయింది మంజుల.

వంగి అతని పాదాలు తాకి కళ్ళకద్దుకొంది.

లేచిన ఆమె కళ్ళలోని కన్నీళ్ళు అతనికా చీకట్లో నక్షత్రాల్లా కనిపించాయి.

ధైర్యానిస్తున్నట్లు ఆమె చేతిలో చెయ్యివేశాడు.

జలజలమని పూల వర్షంలా కన్నీరు కారి అతని చేతిని తడిపి వేసింది.

మామగారి గదిలోనించి మామ గారి దగ్గు వినిపించడంతో, కొంగు ఒళ్ళంతా కప్పుకొని గబగబా లోనికి నడిచింది మంజుల.

* * *

మరునాటిఉదయం ఆ బ్రాహ్మణ వాడంతా పాక్కిపోయింది, మంజుల లేచిపోవడం.

మంజుల కిప్పుడు తాను తప్పు చేసిందన్న బాధ లేదు. కాని అత్త మామలకు, భర్తకు-తాను వేసిన మచ్చ వాళ్ళు బ్రతికినంత కాలం చెరిపేసుకోలేనిది. *